విలేకరులు కావలెను

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455



epaper.hindusthanmedia.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దినపత్రిక — సామాన్యుడి నేస్తం








ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 85 ఆదివారం జూలై 26 2026, పేజీలు - 4 వెల :2/-


# చట్టసభల్లోకి 'జెన్ జీ'..!







**-21 ఏళ్లకే అసెంబ్లీ, లోక్‌సభకు పోటీ అవకాశం కల్పించాలి**

**-25 ఏళ్లకే మండలి, రాజ్యసభకు పోటీ చేసే అవకాశం ఇవ్వాలి: సీఎం రేవంత్‌రెడ్డి**

**-ఆగస్టు తొలి వారంలో ప్రత్యేక సమావేశాలు.. వయసు తగ్గింపు తీర్మానం చేసి కేంద్రానికి పంపుతాం**

**-లోక్‌సభలో జెన్ జీ ప్రాతినిధ్యం 1 శాతం కంటే తక్కువ.. ఇది మారాలి**

హిందుస్థాన్ మీడియా :

దేశంలోని అత్యున్నత చట్టసభల్లో యువత, ముఖ్యంగా జెన్ జీ తరం ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. 21 ఏళ్లకే శాసనసభ, లోక్‌సభకు పోటీ చేసే అవకాశం, 25 ఏళ్లకే శాసనమండలి, రాజ్యసభకు పోటీ చేసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం ఆగస్టు తొలి వారంలో శాసనసభ, శాసనమండలి ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వయోపరిమితి తగ్గింపుపై తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని ప్రకటించారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని, జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జికి నిరసనగా పీసీసీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. పీపుల్స్ ప్లాజా నుంచి నెక్లెస్ రోడ్డు వరకు సాగిన ర్యాలీలో భారీ సంఖ్యలో జెన్ జీ యువత పాల్గొన్నారు.

**యువతకు రాజకీయాల్లో సముచిత ప్రాతినిధ్యం:**

ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ.. ప్రపంచంలోని పలు అభివృద్ధి చెందిన దేశాల్లో 21 ఏళ్లకే ప్రధానమంత్రులయ్యే అవకాశం ఉన్నప్పుడు భారత యువతకు ఆ అవకాశం ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. దేశ జనాభాలో సుమారు 30 శాతం ఉన్న జెన్ జీకి లోక్‌సభలో 1 శాతం కంటే తక్కువ ప్రాతినిధ్యం ఉండటం సరికాదన్నారు. రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించారని గుర్తు చేశారు. అలాగే పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో స్థానిక సంస్థల్లో మేయర్లు, జడ్పీ చైర్మన్లు వంటి పదవులకు పోటీ చేసే వయసును 25 నుంచి 21 ఏళ్లకు తగ్గించిన విషయాన్ని ప్రస్తావించారు.

**ఆగస్టులో ప్రత్యేక సమావేశాలు:**

జెన్ జీ సమస్యలు పరిష్కారం కావాలంటే చట్టసభల్లో వారికి ప్రాతినిధ్యం ఉండాలని సీఎం అన్నారు. 21 ఏళ్లకే అసెంబ్లీ, లోక్‌సభకు, 25 ఏళ్లకే శాసనమండలి, రాజ్యసభకు పోటీ చేసే అవకాశం కల్పించాలని తాము కోరుతున్నామని తెలిపారు. ఈ అంశంపై ఆగస్టు మొదటి వారంలో శాసనసభ, శాసనమండలిని ప్రత్యేకంగా సమావేశపరిచి వయోపరిమితి తగ్గింపుపై తీర్మానం ఆమోదించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని వెల్లడించారు.

**"రోడ్ల నుంచి నేరుగా పార్లమెంట్‌లోకి రావాలి":**

"జంతర్‌మంతర్ నుంచి పార్లమెంట్‌కు ప్రదర్శనగా వెళ్లడం కాదు.. రోడ్లపై నుంచి నేరుగా పార్లమెంట్‌లోకి వెళ్లేలా యువత ఎదగాలి" అని సీఎం పిలుపునిచ్చారు. 21 ఏళ్లకే లోక్‌సభకు పోటీ చేసే అవకాశం కల్పిస్తే జెన్ జీ యువత తమ గళాన్ని పార్లమెంట్‌లోనే వినిపించగలదన్నారు. దేశ అత్యున్నత సివిల్ సర్వీసులకు 21 ఏళ్లకే ఎంపికయ్యే అవకాశం ఉన్నప్పుడు ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యేందుకు మాత్రం ఎక్కువ వయసు ఎందుకని ప్రశ్నించారు. యువతకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించాల్సిన సమయం వచ్చిందన్నారు.

**జెన్ జీ నేతకే విద్యాశాఖ..!:**

కేంద్రంలో రాహుల్‌గాంధీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడితే విద్యాశాఖను జెన్ జీకి చెందిన నాయకుడికే అప్పగించేలా తాను రాహుల్‌గాంధీ, ఇండియా కూటమి నేతలను ఒప్పిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యాశాఖ, ఐటీ వంటి కీలక శాఖలు 60, 70, 90 ఏళ్ల వయసున్నవారికే పరిమితం కాకూడదని, యువతకు అప్పగించాలని అన్నారు. యువతకు ఏం కావాలో యువతకే బాగా తెలుసని వ్యాఖ్యానించారు. జెన్ జీ సాధించిన విజయాలను కాంగ్రెస్ పార్టీ ఖాతాలో వేసుకునే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు.

**"పోరాటం ఇంకా ముగియలేదు" :**

లాఠీలు, తూటాలకు వెరవకుండా జెన్ జీ యువత పోరాడుతోందని సీఎం ప్రశంసించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పోరాటం ముగిసిపోలేదన్నారు. పేపర్ లీకేజీ కారణంగా మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని, ఉద్యమ సమయంలో విద్యార్థులపై పెట్టిన కేసులను సోమవారం లోపు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కరించకపోతే పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని సీఎం హెచ్చరించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్, సీపీఐ నాయకులు, జెన్ జీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీపై నిప్పులు.. అధికారులకు క్లాస్.. ఆలూరులో చంద్రబాబు ఫైర్

**-కర్నూలు జిల్లా ఆలూరులో సంజీవని కార్యక్రమం**

**-అధికారుల పనితీరుపై సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తి**

**-పలు శాఖల అధికారులను నిలదీసి, పనితీరు మార్చుకోవాలని గట్టిగా హెచ్చరించిన వైనం**

**-బాబాయ్ హత్య కేసును ప్రస్తావిస్తూ వైసీపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు**

**-రౌడీయిజం సహించేది లేదని, శాంతిభద్రతల విషయంలో కఠినంగా ఉంటామని స్పష్టం**

హిందుస్థాన్ మీడియా :



ముఖ్యమంత్రి చంద్రబాబు తన పాలనలో నిర్లక్ష్యానికి, అలసత్వానికి చోటు లేదని గట్టిగా హెచ్చరించారు. కర్నూలు జిల్లా ఆలూరులో సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. వైసీపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించడంతో పాటు, ప్రభుత్వ అధికారుల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రజాధనం వృథా అయినా, ప్రజలకు సేవలు అందడంలో జాప్యం జరిగినా సహించేది లేదని స్పష్టం చేశారు.

**ప్రతిపక్షంపై తీవ్ర విమర్శలు**

గత ఐదేళ్ల పాలనలో రాయలసీమకు చేసిందేమీ లేదని, తాము రెండేళ్లలోనే ఇరిగేషన్‌పై రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తే, వారు ఐదేళ్లలో రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని చంద్రబాబు ఆరోపించారు.

"బాబాయిని గొడ్డలితో లేపేసి, ఆ కేసును మా మీదకు నెట్టి సానుభూతితో ఓట్లు సంపాదించుకోవాలని చూశారు. ఇకపై అలాంటి నీచ రాజకీయాలు సాగవు. రౌడీయిజం చేసే వారిని, ఆడబిడ్డల జోలికి వచ్చేవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. శాంతిభద్రతల పరిరక్షణకు మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది" అని చంద్రబాబు ఘాటుగా హెచ్చరించారు. గతంలో రాయలసీమలో ఫ్యాక్షన్ గొడవలు ఉండేవని, తమ పాలనలో శాంతిని నెలకొల్పామని గుర్తుచేశారు.

**అధికారుల పనితీరుపై అసహనం**

అనంతరం, నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలు, సేవల అమలుపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. 42 రకాల సేవలపై తన వద్ద ఉన్న డేటాను ప్రస్తావిస్తూ, పలువురు అధికారుల పనితీరుపై బహిరంగంగానే అసంతృప్తి వెళ్లగక్కారు. అన్న క్యాంటీన్ నిర్వహణ, తాగునీటి సరఫరా, రోడ్లపై గుంతలు, రీసర్వే, మధ్యాహ్న భోజనం, సాంఘిక సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ వంటి అంశాల్లో ఆలూరు నియోజకవర్గం వెనుకబడి ఉందని గణాంకాలతో సహా వివరించారు. తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యంపై సంబంధిత అధికారిని నిలదీసిన సీఎం, "మీ పరిస్థితి బాగాలేదు. మళ్లీ వస్తా.. పరిస్థితి మారకపోతే చాలా సీరియస్‌గా ఉంటుంది. అవసరమైతే ట్యాంకర్లు పెట్టండి, కానీ ప్రజలకు నీళ్లు ఇవ్వాల్సిందే" అని ఆదేశించారు. ఆర్టీసీ బస్సు సర్వీసులు కూడా సరిగా లేవన్న ఫిర్యాదులపై స్పందిస్తూ, "మీరు ఆంధ్రాలో ఉన్నారో, కర్ణాటకలో ఉన్నారో అర్థం కావడం లేదు. నెల రోజుల్లో పరిస్థితి మారకపోతే మీ కథ వేరేగా ఉంటుంది" అని ఆర్టీసీ అధికారికి వార్నింగ్ ఇచ్చారు. తాను ఇంత కష్టపడుతుంటే క్షేత్రస్థాయిలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని, పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ క్రమంలోనే, గిరిజన సంక్షేమ హాస్టళ్లు, శాప్ వంటి కొన్ని శాఖల పనితీరును ప్రశంసించడం గమనార్హం. ప్రజలకు మెరుగైన పాలన అందించే వరకు తన పోరాటం ఆగదని చంద్రబాబు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

**-శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో విశేష పూజలు.. విష్ణు సహస్రనామ**
**-పారాయణంతో మార్మోగిన ఆలయ ప్రాంగణం**



హిందుస్థాన్ మీడియా, చేర్యాల:

హైందవులు అత్యంత పవిత్రంగా భావించే తొలి ఏకాదశి (శయన ఏకాదశి) పర్వదినాన్ని చేర్యాల పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీమహావిష్ణువు చాతుర్మాస్య దీక్షలో భాగంగా నాలుగు నెలల పాటు యోగనిద్రలోకి ప్రవేశించే ఈ పుణ్యదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శేషాచార్యులు (రాజు స్వామి) ఆధ్వర్యంలో ప్రాతఃకాల సేవ, పంచామృతాభిషేకం, పంచసూక్తాభిషేకం, ప్రత్యేక అర్చనలు వైభవంగా నిర్వహించారు. అనంతరం గోదా గోష్టి, వికాస తరంగిణి బృందాల ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ పారాయణం 11 సార్లు, భగవద్గీత పారాయణం, శ్రీమదష్టాక్షరీ మంత్రాన్ని 101 సార్లు పారాయణం చేశారు. ఈ సందర్భంగా రాజు స్వామి తొలి ఏకాదశి పర్వదిన విశిష్టతను, శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి ప్రవేశించే ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను సమకాలీన అంశాలతో మేళవించి భక్తులకు హృద్యంగా వివరించారు. అనంతరం 11 భజనలతో నామసంకీర్తనం, వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారిని యోగనిద్రలోకి సాగనంపే సంప్రదాయాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఉదయం నుంచే భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో కళకళలాడింది.

## సిద్దిపేటలో కలకలం.. పోలీసుల కళ్లుగప్పి ఖైదీ పరార్!



హిందుస్థాన్ మీడియా, సిద్దిపేట:

పోలీసుల అప్రమత్తత లోపమో... లేక ఖైదీ ముందే వేసుకున్న ప్లానో తెలీదు గానీ, సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఓ ఖైదీ పోలీసుల కళ్లుగప్పి పరారైన ఘటన తీవ్ర కలకలం రేపింది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య పరీక్షల కోసం తీసుకొచ్చిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం ప్రకారం, వెల్దుర్తి గ్రామానికి చెందిన జొన్నల సాయి కుమార్ అనే ఖైదీని వైద్య పరీక్షల నిమిత్తం పోలీసులు సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరీక్షలు పూర్తైన అనంతరం ఖైదీలను తిరిగి పోలీసు వాహనంలోకి ఎక్కిస్తున్న సమయంలో సాయి కుమార్ పోలీసుల నిఘా నుంచి చాకచక్యంగా తప్పించుకుని పరారయ్యాడు. ఖైదీ పరారైన విషయాన్ని గుర్తించిన పోలీసులు వెంటనే ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. అనంతరం ఉన్నతాధికారులకు సమాచారం అందించి జిల్లా వ్యాప్తంగా అలర్ట్ ప్రకటించారు. బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు, అనుమానిత ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

## నిరుపేద కుటుంబాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**-విఠలాపూర్‌లో మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన పూజల హరికృష్ణ**



హిందుస్థాన్ మీడియా, సిద్దిపేట:

నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని విఠలాపూర్ గ్రామ సర్పంచ్ తండ్రి ఎల్లయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న పూజల హరికృష్ణ శనివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదారుస్తూ, కష్టకాలంలో ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటాయని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రాజశేఖర్, డైరెక్టర్లు వినోద్, రాజవర్ధన్ రెడ్డి, కిసాన్ సెల్ నాయకుడు బోయ ఎల్లయ్య, డీసీసీ జనరల్ సెక్రటరీ రాజ్‌వీర్, ఇబ్రహీం, గ్రామ శాఖ అధ్యక్షుడు నాగరాజు, ఎర్రం నవీన్ తో పాటు కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# చేర్యాల మున్సిపల్ పరిధిలో పందుల పెంపకంపై నిషేధం

**-పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలోనే పందుల పెంపకం చేపట్టాలి.. కమిషనర్ నాగేందర్**

చేర్యాల (హిందుస్థాన్ మీడియా):

చేర్యాల మున్సిపాలిటీ పరిధిలో పందుల పెంపకాన్ని నిషేధిస్తూ మున్సిపల్ కమిషనర్ నాగేందర్ అధికారిక నోటీసు జారీ చేశారు. పట్టణంలో పందులు స్వేచ్ఛగా సంచరించడం వల్ల డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో పందుల పెంపకం చేపట్టరాదని, పందుల పెంపకందారులు పట్టణానికి కనీసం 5 కిలోమీటర్ల దూరంలో మాత్రమే పందులను పెంచాలని తెలిపారు. తెలంగాణ మున్సిపల్ చట్టం--2019లోని నిబంధనల మేరకు ఈ ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించి మున్సిపల్ పరిధిలో పందులను పెంచినట్లయితే వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ప్రజారోగ్యం, పట్టణ పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకుని పందుల పెంపకందారులు నిబంధనలు పాటించాలని, ప్రజలు కూడా



మున్సిపాలిటీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# సిరిసిల్ల పోలీసుల ఉక్కుపాదం 60 ద్విచక్ర వాహనాలు, 3 లీటర్ల మద్యం స్వాధీనం






**-అనుమానితుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించండి: డీఎస్పీ నాగేంద్రచారి**

హిందుస్థాన్ మీడియా, రాజన్న సిరిసిల్ల:


ప్రజల భాగస్వామ్యంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చనే లక్ష్యంతో రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు శనివారం సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్లో డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం అత్యంత కీలకమని అన్నారు. కాలనీల్లోకి కొత్తగా వచ్చే వ్యక్తుల వివరాలపై స్థానికులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పోలీస్--ప్రజల సమన్వయంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని పేర్కొన్నారు. ాార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 60 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత యజమానులు అవసరమైన పత్రాలు సమర్పించిన తర్వాతే వాహనాలను విడుదల చేస్తామని పోలీసులు తెలిపారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న కొక్కుల ఆంజనేయులుపై కేసు నమోదు చేసి 3 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. నేర నియంత్రణలో భాగంగా పాత నేరచరిత్ర కలిగిన అనుమానిత వ్యక్తులను పోలీసులు తనిఖీ చేసి వారి ప్రస్తుత నివాసం, ఉపాధి, కార్యకలాపాలపై వివరాలు సేకరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ాచ్చరించడంతో పాటు, తిరిగి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాలనీలు, వ్యాపార సముదాయాలు, ప్రధాన కూడళ్లలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగతనాలు, చోరీలు, ఇతర నేరాలను గుర్తించడం సులభమవుతుందని డీఎస్పీ తెలిపారు. సీసీటీవీ ఏర్పాటుకు పోలీస్ శాఖ అవసరమైన సాంకేతిక సూచనలు, సహకారం అందిస్తుందని చెప్పారు. యువత గంజాయి, మాదకద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు పిల్లలపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు నిర్భయంగా పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ప్రజా శాంతికి భంగం కలిగించే, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ నాగేంద్రచారి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు నాగరాజు, గణేష్, రంజిత్, ఆర్ఎస్ఐ శ్రీనివాస్తో పాటు పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో పావురాల బెడద.. సేఫ్టీ నెట్లకు భారీ డిమాండ్

**-హైదరాబాద్‌లో పావురాల బెడదతో సేఫ్టీ నెట్లు, బర్డ్ స్పైక్‌లకు గిరాకీ**
**-పావురాల రెట్టల వల్ల శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయని వైద్యుల హెచ్చరిక**
**-ఆస్తులకు నష్టం, పరిశుభ్రత లోపం కూడా ప్రధాన కారణాలు**
**-పావురాలకు మేత వేయడంపై హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం**

హిందుస్థాన్ మీడియా

హైదరాబాద్‌లో పావురాల సంఖ్య అసాధారణంగా పెరుగుతుండటంతో, వాటి వల్ల ఉత్పన్నమవుతున్న సమస్యల నివారణకు నగరవాసులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నివాస గృహాలు, వాణిజ్య సముదాయాల యజమానులు తమ బాల్కనీలు, కిటికీలకు పక్షుల నుంచి రక్షణ కల్పించే సేఫ్టీ నెట్లు, బర్డ్ స్పైక్‌లను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీనివల్ల మార్కెట్లో వీటికి ఒక్కసారిగా గిరాకీ పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి సేఫ్టీ నెట్ల విక్రయాలు దాదాపు 40 నుంచి 50 శాతం వరకు పెరిగాయని సికింద్రాబాద్‌కు చెందిన ఒక డీలర్ పేర్కొన్నారు. కేవలం అపార్ట్‌మెంట్ల వాసులే కాకుండా కార్యాలయాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, రెస్టారెంట్ల యజమానులు కూడా వీటిని కొనుగోలు చేస్తున్నారని ఆయన వివరించారు. ముఖ్యంగా బాల్కనీలు, టెర్రస్‌ల వంటి విశాలమైన ప్రదేశాల కోసం 'హెచ్‌డీపీఈ' నెట్లను, ఏసీ యూనిట్లు, కిటికీ అంచుల వంటి పరిమిత ప్రదేశాల కోసం బర్డ్ స్పైక్‌లను వినియోగదారులు అధికంగా ఎంచుకుంటున్నారు. పావురాల వ్యర్థాల (రెట్టల) వల్ల తీవ్రమైన ఆరోగ్య ముప్పు పొంచి ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎండిన వ్యర్థాల నుంచి వెలువడే ఫంగల్ ఇన్ఫెక్షన్ల కారణంగా శ్వాసకోశ అలర్జీలు, హైపర్‌సెన్సిటివిటీ న్యూమోనైటిస్ వంటి వ్యాధులు సంభవించే ప్రమాదం ఉందని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడేవారు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీటితో పాటు పావురాల వ్యర్థాల్లో ఉండే ఆమ్ల గుణాలు భవనాల పెయింట్, లోహపు భాగాలను దెబ్బతీస్తుండగా, పక్షుల గూళ్ల వల్ల డ్రైనేజీ పైపులు అడ్డుపడుతున్నాయి. ఈ సమస్య ఇటీవల




తెలంగాణ హైకోర్టు దృష్టికి కూడా చేరింది. బహిరంగ ప్రదేశాల్లో పావురాలకు మేత వేయడాన్ని నియంత్రించాలని కోరుతూ ముషీరాబాద్‌కు చెందిన డాక్టర్ రాధేశ్యామ్ తపాడియా ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం, పావురాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై మూడు వారాల్లోగా నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీని ఆదేశించింది. పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో ఈ సమస్య భవిష్యత్తులో మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని, తద్వారా రక్షణ నెట్లకు గిరాకీ స్థిరంగా కొనసాగుతుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# పాత ఆండ్రాయిడ్ ఫోన్లకు గూగుల్ షాక్.. మార్ష్‌మెలో వెర్షన్‌కు సపోర్ట్ బంద్!

**-ఆండ్రాయిడ్ 6.0 మార్ష్‌మెలో వెర్షన్‌కు గూగుల్ ప్లే సర్వీసెస్ సపోర్ట్ నిలిపివేత**
**-ఇకపై కనీసం ఆండ్రాయిడ్ 7.0 నూగట్ వెర్షన్ తప్పనిసరి**
**-పాత ఫోన్లలో యాప్స్, నోటిఫికేషన్ల పనితీరుపై క్రమంగా ప్రభావం**
**-ఆగిపోనున్న సెక్యూరిటీ అప్‌డేట్స్**

హిందుస్థాన్ మీడియా

టెక్ దిగ్గజం గూగుల్ పాత ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ వినియోగదారులకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు 11 ఏళ్ల క్రితం విడుదలైన ఆండ్రాయిడ్ 6.0 మార్ష్‌మెలో ఆపరేటింగ్ సిస్టమ్‌కు గూగుల్ ప్లే సర్వీసెస్ సపోర్ట్‌ను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఇకపై ప్లే సర్వీసెస్ అప్‌డేట్స్ పొందాలంటే, సంబంధిత పరికరాల్లో కనీసం ఆండ్రాయిడ్ 7.0 నూగట్ లేదా అంతకంటే పై వెర్షన్ ఉండటం తప్పనిసరి. గూగుల్ తన సపోర్ట్ పేజీలో ఈ విషయాన్ని అప్‌డేట్ చేసింది. గూగుల్ ప్లే సర్వీసెస్ అనేది కేవలం ఒక యాప్ మాత్రమే కాదు, ఇది స్మార్ట్ ఫోన్ బ్యాక్‌గ్రౌండ్‌లో పనిచేసే అత్యంత కీలకమైన సిస్టమ్ కాంపోనెంట్. గూగుల్ అకౌంట్‌తో లాగిన్ అవ్వడం, యాప్స్ నోటిఫికేషన్లు, లొకేషన్ సేవలు, డేటా సింక్రోనైజేషన్ వంటి అనేక ముఖ్యమైన ఫీచర్లు దీనిపైనే ఆధారపడి ఉంటాయి. చాలా థర్డ్-పార్టీ యాప్స్‌లు సక్రమంగా పనిచేయాలన్నా గూగుల్ ప్లే సర్వీసెస్ తోడ్పాటు అత్యవసరం. ఈ నిర్ణయం ప్రభావం ఎలా ఉండబోతోంది? ఆండ్రాయిడ్ 6.0 మార్ష్‌మెలో వెర్షన్‌పై నడిచే ఫోన్లు ఈ మార్పు వల్ల తక్షణమే పనిచేయడం ఆగిపోవు. కాలింగ్, టెక్స్టింగ్ వంటి ప్రాథమిక ఫీచర్లు, ఇప్పటికే ఇన్‌స్టాల్ చేసిన యాప్స్‌లు యథావిధిగా పనిచేస్తాయి. అయితే, రానున్న రోజుల్లో సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ప్లే సర్వీసెస్‌పై ఆధారపడే యాప్స్‌లు మొరాయించడం, కొత్త యాప్స్‌లను డౌన్‌లోడ్ చేయలేకపోవడం, సిస్టమ్ అప్‌డేట్స్ ఆగిపోవడం వంటి ఇబ్బందులు ఎదురవుతాయి. అన్నింటికంటే ముఖ్యంగా, భద్రతాపరమైన లోపాలను సరిదిద్దే సెక్యూరిటీ ప్యాచ్




అప్‌డేట్‌లు ఇకపై ఈ డివైజ్‌లకు అందవు. 2015లో మార్కెట్లోకి వచ్చిన ఆండ్రాయిడ్ మార్ష్‌మెలోకు గూగుల్ సుదీర్ఘకాలం పాటు సపోర్ట్ అందించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఈ వెర్షన్‌ను వినియోగిస్తున్న వారు కేవలం 0.4 శాతం మాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయి. యూజర్ బేస్ గణనీయంగా తగ్గిన పాత వెర్షన్లకు సపోర్ట్ నిలిపివేయడం గూగుల్‌కు సాధారణ ప్రక్రియే. మీ ఫోన్ ఏ వెర్షన్‌పై పనిచేస్తుందో తెలుసుకోవడానికి సెట్టింగ్స్‌లోని 'అబౌట్ ఫోన్' ఆప్షన్‌ను తనిఖీ చేయవచ్చు.

# బిజినెస్

# బ్యాంకులు, ఇన్సూరెన్స్ కేవైసీ కష్టాలకు చెక్.. ఆగస్టు నుంచి సరికొత్త సీకేవైసీ 2.0!




**-ఆగస్టు నుంచి సెంట్రల్ కేవైసీ (సీకేవైసీ) 2.0 విధానం అమలు**
**-తొలి దశలో బ్యాంకులు, బీమా సంస్థలకు వర్తింపు**
**-ఖాతా తెరవాలంటే పదేపదే పత్రాలు సమర్పించాల్సిన పనిలేదు**
**-ఓటీపీ సమ్మతితోనే సంస్థలు వివరాలు పొందేలా రూపకల్పన**
**-ఆర్థిక మోసాలను తగ్గించి, సేవలను విస్తరించడమే ప్రధాన లక్ష్యం**

దేశంలో ఆర్థిక సేవలను మరింత సులభతరం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం ఒక కీలక ముందడుగు వేసింది. బ్యాంకులు, బీమా, మ్యూచువల్ ఫండ్స్ వంటి సేవలు పొందేందుకు వినియోగదారులు పదేపదే తమ గుర్తింపు పత్రాలు (కేవైసీ) సమర్పించాల్సిన అవసరం లేకుండా చేసే "సెంట్రల్ నో-యువర్-కస్టమర్ 2.0" (సీకేవైసీ 2.0) విధానాన్ని వచ్చే నెల, అనగా 2026 ఆగస్టు నుంచి అమల్లోకి తీసుకురానుంది. ఈ మేరకు రాయిటర్స్ ఒక కథనంలో వెల్లడించింది. తొలి దశలో బ్యాంకులు, బీమా కంపెనీలకు ఈ విధానం అందుబాటులోకి రానుండగా, ఈ ఏడాది చివరి నాటికి మ్యూచువల్ ఫండ్స్, బ్రోకరేజీ సంస్థలు కూడా ఇందులో చేరనున్నాయి.

**ఎలా పనిచేస్తుంది?**

ఈ కొత్త విధానం ప్రకారం, వినియోగదారులు ఒకసారి తమ కేవైసీ వివరాలను సెంట్రల్ రిజిస్ట్రీలో నమోదు చేస్తే సరిపోతుంది. ఆ తర్వాత ఏదైనా కొత్త బ్యాంకు ఖాతా తెరవాలన్నా, బీమా పాలసీ తీసుకోవాలన్నా లేదా ఇతర ఆర్థిక సేవలు పొందాలన్నా మళ్లీ డాక్యుమెంట్లు ఇవ్వాల్సిన పనిలేదు. సంబంధిత ఆర్థిక సంస్థకు కేవలం ఓటీపీ ద్వారా సమ్మతి తెలియజేస్తే చాలు. ఆ సంస్థ నేరుగా సెంట్రల్ రిజిస్ట్రీ నుంచి ధ్రువీకరించిన కస్టమర్ డేటాను పొందుతుంది. సింగపూర్, యూరప్‌లోని కొన్ని దేశాల్లో ఇప్పటికే ఇలాంటి వ్యవస్థలు విజయవంతంగా అమలవుతున్నాయి.

**పాత వ్యవస్థ కంటే మెరుగ్గా..**

ప్రస్తుతం ఉన్న సెంట్రల్ కేవైసీ రిజిస్ట్రీలో దాదాపు 120 కోట్ల రికార్డులు ఉన్నప్పటికీ, డేటా నాణ్యత సమస్యలు (ఒకే వ్యక్తి పేరు మీద పలు రికార్డులు, వివరాలు అసంపూర్ణంగా ఉండటం) కారణంగా దాని వినియోగం పరిమితంగానే ఉంది. ఈ సమస్యలను అధిగమించేందుకు సీకేవైసీ 2.0లో పలు మెరుగైన ఫీచర్లను చేర్చారు. ప్రతి రికార్డుకు ఒక 'కాన్ఫిడెన్స్/యాక్యురసీ స్కోర్' జతచేస్తారు. దీనివల్ల ఆ డేటా ఎంతవరకు నమ్మదగినదో సంస్థలు అంచనా వేయగలవని ఈ వ్యవస్థను నిర్మిస్తున్న ప్రొటీన్ ఈగవ్ టెక్నాలజీస్ తెలిపింది.

**లక్ష్యాలు, ప్రయోజనాలు**

దాదాపు 89 శాతం వయోజనులకు బ్యాంకు ఖాతాలు అందుబాటులోకి తెచ్చి ప్రాథమిక ఆర్థిక సేవల్లో విజయం సాధించిన భారత్, ఇప్పుడు తదుపరి దశపై దృష్టి సారించింది. ఈ కొత్త విధానం ద్వారా ఆర్థిక మోసాలను గణనీయంగా తగ్గించవచ్చని, అదే సమయంలో మ్యూచువల్ ఫండ్స్, బీమా, పెన్షన్ పథకాలలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. తమకున్న 50 కోట్ల మంది కస్టమర్ల బేస్‌తో పెట్టుబడిదారుల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు ఈ విధానం దోహదపడుతుందని దేశంలోనే అతిపెద్ద అసెట్ మేనేజర్ అయిన ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ ఆశాభావం వ్యక్తం చేసింది. జూలై చివరి నాటికి లేదా ఆగస్టు ఆరంభంలో బీమా రంగంలో ఇది అమల్లోకి వస్తుందని, దీని ద్వారా సమాచారం దాదాపు తక్షణమే అప్‌డేట్ అవుతుందని పాలసీబజార్ పేర్కొంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా , సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా , ఇన్సూరెన్స్ రెగ్యులేటర్ సంయుక్తంగా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును పర్యవేక్షిస్తున్నాయి. ఈ సంస్కరణ వినియోగదారులకు సౌలభ్యాన్ని పెంచడమే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థను మరింత పారదర్శకంగా, పటిష్టంగా మార్చడంలో కీలక పాత్ర పోషించనుంది.

# క్రీడలు

## ఫిఫా వరల్డ్ కప్‌ల నుంచి అర్జెంటీనాను నిషేధించాలంటూ పిటిషన్... మండిపడిన దేశాధ్యక్షుడు



**-ఫిఫా వరల్డ్ కప్‌ల నుంచి అర్జెంటీనాను నిషేధించాలని ఆన్‌లైన్‌లో భారీ పిటిషన్**
**-పిటిషన్‌కు మద్దతుగా 170 దేశాల నుంచి 2.3 కోట్ల మందికి పైగా సంతకాలు**
**-ఇది మాపై అసూయతో జరుగుతున్న కుట్ర అంటూ స్పందించిన అధ్యక్షుడు జేవియర్ మిలే**
**-2026 వరల్డ్ కప్ ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓటమి తర్వాత రాజుకున్న వివాదం**

ఫుట్‌బాల్ ప్రపంచంలో ఒక కొత్త వివాదం రాజుకుంది. భవిష్యత్తులో జరిగే ఫిఫా వరల్డ్ కప్‌ల నుంచి అర్జెంటీనాను నిషేధించాలంటూ దాఖలైన భారీ ఆన్‌లైన్ పిటిషన్‌పై ఆ దేశ అధ్యక్షుడు జేవియర్ మిలే తీవ్రంగా స్పందించారు. "ఇదంతా మాపై ఉన్న అసూయతోనే జరుగుతోంది" అంటూ ఆయన సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 2026 ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్లో అర్జెంటీనా, స్పెయిన్ చేతిలో 1-0 తేడాతో ఓటమి పాలైన విషయం తెలిసిందే. ఈ టోర్నమెంట్‌లో అర్జెంటీనా జట్టు ఆటగాళ్ల ప్రవర్తన సరిగా లేదని, క్రమశిక్షణ ఉల్లంఘనలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ "అర్జెంటీనా ఔట్" పేరుతో ఒక పిటిషన్ మొదలైంది. దీనికి అనూహ్య స్పందన లభించింది. సుమారు 170 దేశాల నుంచి 2.33 కోట్ల మందికి పైగా ఈ పిటిషన్‌పై సంతకాలు చేశారు. అర్జెంటీనా ప్రవర్తన ఫుట్‌బాల్ క్రీడా స్ఫూర్తిని దెబ్బతీసిందని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ పిటిషన్‌పై అధ్యక్షుడు మిలే ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందిస్తూ, "మీకు శత్రువులు ఉన్నారంటే.. మీరు ఎప్పుడో ఒకప్పుడు దేనికోసమో బలంగా నిలబడ్డారని అర్థం. మేము అర్జెంటీనా కోసం నిలబడతాం. అందరిలో మేం ప్రత్యేకంగా నిలబడటమే అసలు సమస్య. మాపై అసూయ పడతారు. మేము దాదాపు అన్నింటిలోనూ ఉత్తమంగా ఉంటాం" అని పోస్ట్ చేశారు.

## రెండో టీ20లో టీమిండియా భారీ విజయం... జింబాబ్వేపై సిరీస్ కైవసం



**-బ్యాటింగ్, బౌలింగ్‌లో అదరగొట్టిన భారత్ రెండో టీ20లో 90 పరుగుల భారీ తేడాతో విజయం 2-0తో సిరీస్ కైవసం అర్ధ సెంచరీలతో చెలరేగిన ఇషాన్ కిషన్, తిలక్ వర్మ బౌలింగ్‌లో 3 వికెట్లతో రాణించిన అభిషేక్ శర్మ**

జింబాబ్వే పర్యటనలో భారత జట్టు అద్భుత ప్రదర్శనను కొనసాగిస్తోంది. శనివారం హరారే వేదికగా జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. ఈ మ్యాచ్‌లో 90 పరుగుల భారీ తేడాతో జింబాబ్వేను చిత్తు చేసి, మరో మ్యాచ్ మిగిలి ఉండగానే మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0 తేడాతో కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్‌లో ఇషాన్ కిషన్, తిలక్ వర్మ విధ్వంసకర ఇన్నింగ్స్‌లతో చెలరేగగా, అనంతరం బౌలర్లు రాణించడంతో భారత్‌కు సునాయాస విజయం దక్కింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన జింబాబ్వే కెప్టెన్ సికిందర్ రజా బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే, అతని నిర్ణయం సరైంది కాదని భారత బ్యాటర్లు నిరూపించారు. ఓపెనర్లు అభిషేక్ శర్మ (8), వైభవ్ సూర్యవంశీ (20) త్వరగా పెవిలియన్ చేరినా, క్రీజులోకి వచ్చిన వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ (44 బంతుల్లో 81; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అతనికి తిలక్ వర్మ (29 బంతుల్లో 60 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) తోడవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. వీరిద్దరూ అద్భుతమైన అర్ధ సెంచరీలతో భారత జట్టు భారీ స్కోరుకు బాటలు వేశారు. టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 219 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. భారీ లక్ష్య ఛేదనలో జింబాబ్వే ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేకపోయింది. ఓపెనర్ బ్రయాన్ బెన్నెట్ (19 బంతుల్లో 32 పరుగులు) దూకుడుగా ఆడినా, భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ఒత్తిడి పెంచారు. కెప్టెన్ సికిందర్ రజా డకౌట్‌గా వెనుదిరగడం ఆ జట్టును కోలుకోలేని దెబ్బతీసింది. భారత బౌలర్లలో పార్ట్ టైమ్ స్పిన్నర్ అభిషేక్ శర్మ కేవలం 17 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి జింబాబ్వే పతనాన్ని శాసించాడు.



# ‘కాన్ సిటీ’ (నెట్ ఫ్లిక్స్) మూవీ రివ్యూ!

తమిళంలో అర్జున్ దాస్ కి మంచి క్రేజ్ ఉంది. తెలుగులోను ఆయన నటనకీ .. వాయిస్ కి ఫ్యాన్స్ ఉన్నారు. అలాంటి అర్జున్ దాస్ ప్రధానమైన పాత్రను పోషించిన సినిమానే ‘కాన్ సిటీ’. హరీశ్ దుర్రై రాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో, అన్నా బెన్ .. యోగిబాబు .. వడివుక్కరసు కీలకమైన పాత్రలను పోషించారు. జూన్ 26వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ నెల 24వ తేదీ నుంచి ‘నెట్ ఫ్లిక్స్’లో స్ట్రీమింగ్ అవుతోంది. తమిళంతో పాటు ఇతర భాషల్లోను అందుబాటులో ఉంది. శరవణన్ (అర్జున్ దాస్) ఓ ప్రభుత్వ ఉద్యోగి. శ్రీమంతుల కుటుంబానికి చెందిన ఐశ్వర్య (సాక్షి వైద్య) అతణ్ణి ప్రేమిస్తుంటుంది. వాళ్లిద్దరికీ వివాహం జరిపించాలనుకున్న ఆమె తండ్రి, ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటాడు. అందుకు కారణం శరవణన్ కి గల అప్పు. సొంత ఇంటికోసం తల్లి చేసిన అప్పు తీర్చడం కోసం, శరవణన్ అవినీతికి పాల్పడటం మొదలుపెడతాడు. ఈ విషయంలో అతనికి ‘సదా’ సహకరిస్తాడు. ఇద్దరూ కలిసి పెద్ద స్థాయి మోసాలకు శ్రీకారం చుడతారు. ఇక ‘మిత్ర’ (అన్నా బెన్) నమ్మినవాడి చేతిలో మోసపోతుంది. గర్భవతిగా ఉన్న ఆమె, ఎలాంటి కష్టం చేయలేని స్థితిలో ఉన్న ఆమె .. అవినీతి మార్గాన్ని ఎంచుకుంటుంది. ఇళ్లు లీజ్ కి ఇప్పిస్తానని చెప్పి మోసం చేయడం మొదలుపెడుతుంది. అదే ప్రాంతానికి చెందిన జానకి (వడి ఉక్కరసు),తన కొడుకు ‘జాకీ’(యోగిబాబు)తో కలిసి ‘ట్రస్ట్’ పేరుతో డబ్బులు వసూలు చేస్తూ ఉంటుంది. తాము చేస్తున్నది అన్యాయమని కొడుకు చెబుతున్నా ఆమె వినిపించుకోదు. ఇలా ముగ్గురూ అవినీతి మార్గంలో సంపాదిస్తారు. తమ మోసాలు బయటపడే సమయానికి వేరే ప్రాంతానికి పారిపోయి అక్కడ తలదాచుకుంటారు. ఆ సమయంలోనే ‘మిత్ర’ కొడుకు కిడ్నాప్ కి గురవుతాడు. కిడ్నాపర్ ఎవరో కాదు ఒకప్పుడు పోలీస్ ఆఫీసర్ గా ఉన్న కల్యాణ సుందరం (నందగోపాల్) అని తెలుసుకుంటారు. ఈ ముగ్గురూ చేసిన మోసాలు ఎలా బయటపడతాయి? ఒక పోలీస్ ఆఫీసర్ కిడ్నాపర్ గా ఎందుకు మారతాడు? అవినీతి సొమ్మంతా ఏమైపోతుంది? అనేదే కథ. జీవితాన్ని ప్రభావితం చేసేవి అవసరాలు .. ఆపదలు.. అలవాట్లు. ఒక మనిషి దారితప్పడంలో ఇవే ప్రధానమైన పాత్రను పోషిస్తాయి. అవసరాలలో నుంచి .. ఆపదలలో నుంచి బయటపడాలంటే డబ్బు కావాలి. అలవాట్లు మానుకోలేని బలహీనతకు డబ్బుకి మించిన మందులేదు. అందువలన ఈజీ మని కోసం అలాంటివాళ్లు అక్రమ మార్గాలను అనుసరిస్తూ ఉంటారు. అలాంటి వాళ్ల జీవితం ఎలాంటి మలుపు తిరుగుతుంది అనేదే ఈ కథలోని ప్రధానమైన అంశం. అందంగా బ్రతకాలి .. అందరి కంటే గొప్పగా బ్రతకాలి అనే ఆశనే మనిషిని పెడత్రోవ పట్టిస్తుంది. మోసం చేసేవాడు డబ్బు పట్ల ఆశతోనే చేస్తాడు. మోసపోయేవాడు డబ్బు పట్ల ఆశతోనే మోసపోతాడు అనే సత్యాన్ని ఆవిష్కరించే ప్రయత్నాన్ని దర్శకుడు చేసిన తీరు ఆలోచింపజేస్తుంది. పెద్దవాళ్లు తమ ‘కల’ .. తమ ‘ఆశ’ .. అంటూ పిల్లలను అప్పుల పాలు చేసి, వాళ్ల చెడు మార్గంలో వెళ్లడానికి కారకులు అవుతున్నారంటూ చెప్పిన విధానం బాగుంది. అప్పులు .. అవస్థలు .. ఈజీమని కోసం నేరం దిశగా అడుగులు ఫస్టాఫ్ లో ప్రేక్షకుల ముందుకు వస్తాయి. ఆ నేరాలు చేసినందుకు బాధపడుతూ ఇక మారిపోవాలనుకున్న బ్యాచ్ కీ, గతంలో కంటే పెద్ద నేరం చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. అప్పుడు వాళ్లు ఏం చేస్తారు? అనే దిశగా సెకండాఫ్ కొనసాగుతుంది. దర్శకుడు అల్లుకున్న కథ .. వేసుకున్న స్క్రీన్ ప్లే .. ప్రధానమైన నాలుగు పాత్రలను మలిచిన విధానం ఈ సినిమాకి హైలైట్ గా చెప్పుకోవచ్చు. ఈ కంటెంట్ లో కథనే హీరో. పరిస్థితులను బట్టి పాత్రలు పరిగెడుతూ ఉంటాయి .. సందర్భాన్ని బట్టి ప్రవర్తిస్తూ ఉంటాయి. అర్జున్ దాస్ మార్క్ ను చూపించాడనికి గానీ .. యోగిబాబు మార్కును చూపించడానికి గాని దర్శకుడు ప్రయత్నించలేదు. పరిస్థితులకు తగినట్టుగానే ఆ పాత్రలు ప్రవర్తిస్తాయి. సన్నివేశాలు కూడా సహజత్వాన్ని దాటుకుని వెళ్లకపోవడం మనం గమనించవచ్చు. అందరూ తమ పాత్రలలో ఒదిగిపోయారు. ఎవరూ కూడా నటిస్తున్నట్టుగా ఉండదు. అరవింద్ విశ్వనాథన్ ఫొటోగ్రఫీ .. సీన్ రోల్డన్ నేపథ్య సంగీతం .. అరుళ్ మోసెస్ ఎడిటింగ్ పెర్ఫెక్ట్ గా అనిపిస్తాయి. డబ్బు పోగొట్టుకుంటే తిరిగి సంపాదించుకోవచ్చు .. కానీ నమ్మకమనేది పోగొట్టుకుంటే తిరిగి సంపాదించుకోలేము. కష్టపడి సంపాదించుకున్నది మాత్రమే నిలుస్తుంది. మోసంతో కూడబెట్టిన ధనం .. అలాగే చేజారిపోతుంది అనే సందేశం బలంగా ఇచ్చిన కంటెంట్ ఇది. ఈ మధ్య కాలంలో వచ్చిన బెస్ట్ కంటెంట్ గా చెప్పుకోవచ్చు. ఎక్కడా బోర్ అనిపించకుండా ఆసక్తికరంగా సాగిపోయే ఈ సినిమాను ఫ్యామిలీతో కలిసి చూడొచ్చు.

## మంచి పాత్రల కోసమే వేచి చూస్తున్నా.. పెళ్లికి కూడా తొందరలేదు: నిధి అగర్వాల్

**జీవితంలో దేని గురించి తాను తొందరపడనన్న నిధి అగర్వాల్**

**ప్రాధాన్యత ఉండే పాత్రలు చేయడానికి తమిళ చిత్రసీమ సరైన వేదిక అని వ్యాఖ్య**

**తనది సున్నితమైన మనస్తత్వమన్న నిధి**



సినిమా అవకాశాల కోసం తాను ఎప్పుడూ తొందరపడనని... జీవితంలో సినిమాలైనా, పెళ్లయినా దేనికీ హడావుడి పడేది లేదని నటి నిధి అగర్వాల్ స్పష్టం చేసింది. మంచి కథలు, అర్థవంతమైన పాత్రల కోసమే తాను వేచి చూస్తున్నానని తెలిపింది. ‘ఈశ్వరన్’, ‘భూమి’, ‘కళగ తలైవన్’ చిత్రాల తర్వాత తమిళంలో మళ్లీ నటించకపోవడానికి సరైన ప్రాజెక్ట్ రాకపోవడమే కారణమని చెప్పింది. నటనకు ప్రాధాన్యం ఉండే పాత్రలు చేయడానికి తమిళ చిత్రసీమ సరైన వేదిక అని వ్యాఖ్యానించింది. పవన్ కల్యాణ్‌తో ‘హరి హర వీరమల్లు’, ప్రభాస్‌తో ‘ది రాజా సాబ్’ వంటి భారీ చిత్రాల్లో నటించడాన్ని గొప్ప అదృష్టంగా భావిస్తున్నట్లు నిధి తెలిపింది. ప్రస్తుతం తెలుగు, హిందీ ప్రాజెక్టులతో బిజీగా ఉండటం వల్లే తమిళ సినిమాలకు కాస్త దూరమయ్యానని పేర్కొంది. వృత్తిపరంగా తాను ఎంతో కష్టపడతానని, అయితే మిగతా విషయాల్లో చాలా సోమరినని సరదాగా వ్యాఖ్యానించింది. అలాగే తనది చాలా సున్నితమైన మనస్తత్వమని, అందుకే భావోద్వేగాలను బయటకు చూపించనని తెలిపింది. ప్రస్తుతం మరో రెండు కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే వాటి వివరాలు వెల్లడిస్తానని నిధి చెప్పింది. ఇకపోతే ఆమె త్వరలోనే ‘మిరాయ్’ పార్ట్-2 తో పాటు హిందీ సైకలాజికల్ థ్రిల్లర్ ‘ది ఇన్‌ఫ్లుయెన్సర్’ చిత్రాల ద్వారా ప్రేక్షకుల ముందుకు రానుంది.






Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455